క్లుప్తంగా

100 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

అమలాపురం టౌన్: స్థానిక సూర్యనగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో 100 మంది పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, తుని నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలా మణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కేతా భాను, రాజులపూడి మురళి, బండారు సత్యనారాయణ, చెల్లుబోయిన నాని తదితరులు పాల్గొన్నారు.

నాస్తికోద్యమ విప్లవవీరుడు పెరియార్ రామస్వామి



పెరియార్ రామస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

యానాం: అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన నాస్తికోద్యమ విప్లవ వీరుడు పెరియార్ రామస్వామి చిరస్మరణీయులని పలువురు పేర్కొన్నారు. ఆదివారం పెరియార్ రామస్వామి జయంతిని పురస్కరించుకుని స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రకాశం, సమాచారశాఖ పీఆర్‌ఓ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



రమణ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ఉప్పలగుప్తం: ఇటీవల మరణించిన ఉపాధ్యాయుడు ఎస్వీ రమణ కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమం ద్వారా సమకూర్చిన రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు ఆదివారం అందజేశారు. ఉపాధ్యాయుడు ఎస్వీ రమణ సంస్మరణ సభను ఆదివారం గోపవరంలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని రమణ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు విశ్వనాథ్, బి.చంద్రకళ, పెన్నాడ శ్రీనివాస్, ఎంటీవీ సుబ్బారావు, గుత్తుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా 50 బస్తాల సిమెంట్ అందజేత



గృహనిర్మాణదారుడు లోవరాజుకు సిమెంట్ బస్తాలను అందజేస్తున్న సర్పంచ్ సూరిబాబు

తాళ్లరేవు: మండలంలోని జి.వేమవరం పంచాయతీలో గృహ నిర్మాణం చేసుకుంటున్న యర్రంనీడి లోవరాజు అనే నిరుపేదకు స్థానిక సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు 50 బస్తాల సిమెంట్‌ను ఉచితంగా అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం సిమెంట్ బస్తాలను లోవరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ను పలువురు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

యానాం: నియోజకవర్గ పరిధిలోని రమాభాయి నగర్ గ్రామ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇసుకపట్ల విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా బూలా బాబు, గ్రామపెద్దగా బోమిడి శరత్‌బాబు, ట్రెజరర్‌గా మట్టపర్తి కృష్ణ, కార్యదర్శిగా జిళ్లెళ్ల చిరంజీవి, సహాయ కార్యదర్శిగా కమిడి కృష్ణప్రసాద్, యాక్టివ్ మెంబర్‌గా యాళ్ల వెంకట కుమార్ ఎన్నికయ్యారు.

జీతాల కోసం వినతి

యానాం: వినాయక చవితిని అంతా ఘనంగా చేసుకుంటుంటే తాము మాత్రం నెలల తరబడి జీతాలందక ఇబ్బందులు పడుతున్నామని యానాం మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సబ్బతి నూకాంబరం ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు హౌస్ ట్యాక్స్ మ్యాచింగ్ గ్రాంట్ ఏడేళ్లుగా ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. బడ్జెట్‌లో జీతాలకు సంబంధించి ఫండ్స్‌ను కేటాయించడం లేదని చెప్పారు. ఇప్పటికైనా తమను ఆదుకోవాలంటూ పుదుచ్చేరి ప్రభుత్వానికి వినతి పత్రం పంపినట్లు తెలిపారు.

విఘ్నాలను తొలగించవయ్యా.. వినాయకా..

పూజాపత్రి కొనుగోళ్లతో కిక్కిరిసిన మార్కెట్లు



యానాం బైపాస్ సెంటర్‌లో విద్యుత్ వెలుగులలో గణనాథుని మండపం



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న తాళ్లరేవు సంతపేట సెంటర్



యానాంలో జోరుగా పాలవెల్లి అమ్మకాలు



వినాయక పూజ పత్రి అమ్మకాలు

ఐ.పోలవరం/అమలాపురం టౌన్/తాళ్లరేవు/అల్లవరం/యానాం: హిందువులకు తొలి పండగ వినాయక చవితి. అందుకే విఘ్నాలను తొలగించే వినాయకుడిగా అందరిచేత పూజలందుకుంటారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే వినాయక చవితి వేడుకలకు ఎక్కడికక్కడ భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మండపాలను సిద్ధం చేసి విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. చలువ పందిళ్లు వేసి పచ్చని తోరణాలు కట్టారు. చవితి పూజ కోసం పత్రి, ఫలాలు, పాలవెల్లి, వినాయక విగ్రహాల కొనుగోళ్లతో ఆదివారం మార్కెట్లలో సందడి నెలకొంది. యానాంలోని చిన్నాసెంటర్, పిల్లారాయవీధి, స్టేట్ బ్యాంకు వీధి తదితర ప్రాంతాలు కొనుగోళ్లతో కిటకిటలాడాయి.

వాడవాడలా భారీ సెట్లు

- యానాం బైపాస్ సెంటర్‌లో వరసిద్ధి వినాయకుని వర్తకసంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుని మండపం విద్యుత్ వెలుగులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది.
- అమలాపురం పట్టణంలోని గొల్లగూడెం ఆదిత్య స్కూలులో విద్యార్థులు వినాయక చవితి సంబరాలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. స్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు గణపతి వేషధారణలతో అలరించారు. విద్యార్థులు వినాయక చవితి పూజలు చేసి పాటలు పాడి ఆకట్టుకున్నారు.
- తాళ్లరేవు మండలంలోని సుంకరపాలెం జంక్షన్ వద్ద వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మండపం అందరినీ ఆకట్టుకుంటుంది. స్థానిక వ్యాపారులంతా కలిసి నిర్వహించే గణపతి నవరాత్ర వేడుకులకు సంబంధించి దేవాలయాన్ని తలపించేలా భారీ సెట్ వేశారు.
- తాళ్లరేవులో రహదారికి ఇరువైపులా దుకాణాలు వేసి వినాయక విగ్రహాలు, వివిధ రకాల పత్రి, పూలదండులు, వివిధ రకాల పండ్లను విక్రయిస్తున్నారు. దీంతో సుంకరపాలెం జంక్షన్‌తో పాటు తాళ్లరేవు సంతపేట, ఇంజరం మార్కెట్ సెంటర్‌లో సందడి నెలకొంది.
- ఐ.పోలవరం మండలం మురమళ్ల, పాతయింజరంలలో ప్రధాన వాణిజ్య కేంద్రాలు చవితి సందడితో కళకళలాడుతున్నాయి. పత్రి, పండ్లు, పూలు, ప్రతిమల కొనుగోళ్లతో సందడిగా మారాయి.

చిట్టి చేతులతో మట్టి వినాయకుడు



మట్టితో గణపతిని తయారుచేస్తున్న సింధు, సుమంత్

అల్లవరం: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు మేము సైతం అంటూ ఆ చిన్నారులు మట్టితో గణపతి ప్రతిమలను తయారుచేసి శభాష్ అనిపించుకున్నారు. అల్లవరం మండలం కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని మాకేవారిపేటకు చెందిన చిన్నారులు ఆదివారం ఉదయం మట్టితో గణపతిని తయారుచేస్తుండగా 'సాక్షి' పలకరించింది. కోడూరుపాడు హైస్కూల్లో 7వ తరగతి చదువుతున్న సింధు, 5వ తరగతి చదువుతున్న సుమంత్ ఇద్దరూ కలిసి మట్టి గణపతిని తయారుచేశారు. వినాయకచవితి పురస్కరించుకుని మట్టి వినాయకుడిని కొలుస్తామని ఆ చిన్నారులు తెలిపారు.

తీరంలో స్వచ్ఛ సాగర్ – సురక్షిత సాగర్



ఓడలరేవు సముద్ర తీరంలో స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ నిర్వహిస్తున్న అధికారులు



ఎస్.యానాం తీర ప్రాంతంలో శుభ్రం చేసిన వ్యర్థాలతో ఇన్కాయిస్ శాస్త్రవేత్తలు

అల్లవరం: అంతర్జాతీయ తీర శుభ్రత దినోత్సవం సందర్భంగా ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్కాయిస్), మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఓడలరేవు సముద్ర తీరంలో స్వచ్ఛసాగర్ – సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మత్స్యశాఖ, మెరైన్ అధికారులు తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, చెదారాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, ఇన్కాయిస్ శాస్త్రవేత్త సూర్య, ఎఫ్‌డీఓ అశ్విని, వర్మ, మల్లాడి ఉమామహేశ్వరరావు, బీవీసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సాగరతీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ఉప్పలగుప్తం: సాగర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచి పర్యావరణాన్ని కాపాడాలని ఇన్కాయిస్ శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఎస్.యానాం తీర ప్రాంతంలో స్థానిక మత్స్యకార నాయకులు, పాఠశాల విద్యార్థులు తీరంలో ఉన్న వ్యర్థాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చెన్నూరి సతీష్, హరీష్, ఎం.త్రిమూర్తులు, పి.శ్రీనివాసరావు, బొమ్మిడి దుర్గామల్లేశ్వర్, లంకే చిరంజీవి, హెచ్‌ఎం బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలను పంపిణీ చేసిన డీఎస్పీ



ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక రాజా ఆర్థోపెడిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ డాక్టర్ రాజా ఆధ్వర్యంలో గడియారం స్తంభం సెంటరులో ఆదివారం ఏర్పాటైన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ ప్రారంభించారు. ప్రజలకు ఉచితంగా మట్టి విగ్రహాలను సమకూర్చిన డాక్టర్ రాజాను డీఎస్పీ అభినందించారు. అనంతరం డీఎస్పీ అంబికాప్రసాద్ మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పి.వీరబాబు, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, పట్టణ ఎస్ఐ ప్రభాకరరావు, వర్రే శేషు తదితరులు పాల్గొన్నారు. స్థానిక దేవాంగుల వీధిలో సత్య శివ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జ్యూయలర్స్ యాజమాని సత్య శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు భరణికాన బాబు, మద్దింశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఇస్కాన్' నిర్మాణానికి భూమి కేటాయింపు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్‌కు అనుబంధంగా అమలాపురంలో బ్రాంచ్ నిర్మాణం కోసం ప్రభుత్వం స్థానిక రావులచెరువు ప్రాంతంలో 54 సెంట్ల భూమిని కేటాయించింది. ఇస్కాన్ బ్రాంచ్ ఇన్‌చార్జి శివానంద నిమయిదాస్ ఈ భూమిని చదును చేసే పనులకు ఆదివారం కొబ్బరి కాయ కొట్టి శ్రీకారం చుట్టారు. పనులకు అవసరమైన ప్రొక్లెయిన్లు, ఇతర సామగ్రిని అమలాపురం రూరల్ మండల నాయకుడు లింగోలు పండు ఉచితంగా సమకూర్చారు. ఈ స్థలంలో శ్రీకృష్ణ మందిరం, వృద్ధాశ్రమం, గురుకుల పాఠశాల, అన్నదాన భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.

పథకాల ఫైళ్లకు ఎల్జీ ఆమోదం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా అమలు చేయనున్న వివిధ పథకాలకు సంబంధించిన ఫైళ్లను ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం ఆమోదించారు. పుదుచ్చేరివ్యాప్తంగా చేపల పెంపకాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో మత్స్యకారులకు ఇవ్వనున్న రూ.7,500 నుంచి రూ.8,500 మత్స్య సబ్సిడీ పథకం ఫైలుతో పాటు వృత్తి శిక్షణ సంస్థల్లో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనీలకు నెలవారీ స్టైఫండ్, మెటీరియల్ ఖర్చుల పెంపు ఫైలుకు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

20న ఓబీసీ రిజర్వేషన్లపై చర్చ

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌లోని మున్సిపాలిటీలు, కమ్యూన్ పంచాయతీల్లో ఓబీసీ రిజర్వేషన్ అమలు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసేందుకు పుదుచ్చేరి ప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ కేకే శశిధరన్ ఏకసభ్య కమిషన్ ఈనెల 20న యానాం రానుంది. స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి జరగనున్న సమావేశంలో స్థానికంగా ఉన్న వెనకబాటుతనంపై చర్చించి అనంతరం వెనకబడిన తరగతులు(ఓబీసీ)లకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సిఫార్సు చేస్తారు. సమావేశంలో సంబంధిత వర్గాల ప్రతినిధులు, అధికారులు, పరిశోధనా సంస్థలు తమ అభిప్రాయాలను తెలపవచ్చునని ప్రత్యేక అధికారి డి.రామబత్తిరన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధి రాఘవులపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. దీనికి సంబంధించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.2,900 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహా సంకల్పయాత్ర

అల్లవరం: మండలంలోని కొమగిరిపట్నంలో అమలాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ శెట్టిబత్తుల రాజాబాబు ఆధ్వర్యంలో ఆదివారం మహా సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చిక్కం భీముడు, కటికిరెడ్డి బాబి, నల్లా రాము, చిక్కాల సతీష్ పాల్గొన్నారు.

పంట కాలువలో పడిన ఆటో

రాజోలు: వెనుక నుంచి గుర్తుతెలియని కారు వేగంగా ఒక ఆటోను ఢీ కొట్టడంతో రాజోలు కాటన్ పార్కు సమీపాన పి.గన్నవరం ప్రధాన పంటకాలువలోకి ఆదివారం ఆటో పడిపోయింది. ఆటో పంటకాలువలో పడిపోయిన సమయంలో ఆటోడ్రైవర్‌తో పాటు ఇద్దరు ప్రయాణికులున్నారు. ఆటోను ఢీకొట్టిన కారు తప్పించుకుని వేగంగా తాటిపాక వైపు వెళ్లిపోయింది. ఆటోలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పంట కాలువలో పడిపోయిన ఆటోను తాళ్ల సాయంతో బయటకు తీశారు. ఆటో యూనియన్ నాయకుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

యానాం అభివృద్ధికి పూర్తి సహకారం



స్పీకర్ సెల్వంతో సమావేశమైన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని స్పీకర్ సెల్వం పేర్కొన్నారు. ఆదివారం పుదుచ్చేరి అసెంబ్లీ ప్రాంగణంలోని స్పీకర్ కార్యాలయంలో ఆయనను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యానాంలో ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన మౌలిక వసతులు రూపకల్పన, డ్రెయినేజీల ఆధునీకరణ, రహదారుల అభివృద్ధి, వరదరక్షణ గట్టు ఆధునీకరణ, డంపింగ్‌యార్డు ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. యానాంను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ చేస్తున్న ప్రయత్నాలకు నిధులు అందిస్తామని స్పీకర్ సెల్వం హామీ ఇచ్చారు.

విశ్వకర్మ ఆది గురువు



విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



చేతివృత్తుల కళాకారులను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమా తదితరులు

అమలాపురం టౌన్: వివిధ వృత్తుల వారికి విరాట్ విశ్వ కర్మ ఆది గురువు అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. స్థానిక దుడ్డివారి అగ్రహారంలో విశ్వకర్మ కమ్యూనిటీ హాలులో ఆదివారం జరిగిన విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విశ్వకర్మ చిత్రపటానికి ఎమ్మెల్సీ పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తాళాబత్తుల లక్ష్మణరావు, అనుపోజు శ్రీనివాస్, భరణికాన బాబు, తాళాబత్తుల కొండ తదితరులు పాల్గొన్నారు. ఇదే కమ్యూనిటీ హాలులో జరిగిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పాల్గొని పూజలు చేశారు. స్థానిక జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘ కార్యాలయంలో విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

అమలాపురం రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని అమలాపురం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల రామ్మోహన్‌రావు, జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ నిర్వహించారు. అనంతరం చేతివృత్తుల కళాకారులను ఘనంగా సత్కరించారు.

జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక

రావులపాలెం: ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన పలువురు విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఈతకోట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేఎస్వీ కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. అండర్–17 విభాగంలో సీహెచ్ లక్ష్మీసాయిశ్రీ కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, యోగా లోను, కె.మీనా అమృతసత్య వాలీబాల్, త్రోబాల్‌లోను ఎం.స్వరగీతిక వాలీబాల్, త్రోబాల్‌లోను ఎం.వీరవేణి ఖోఖోలోను, కె.యక్షిత యోగాలోను, కె.దివ్యదుర్గ మహేశ్వరి యోగాలోను, వై.రిషిత షటిల్‌లోను జిల్లాకు ఎంపికయ్యారన్నారు. అలాగే అండర్–14 విభాగంలో వై.లావణ్య వాలీబాల్, కబడ్డీలను డి.కల్పన వాలీబాల్, కె.మంజుశ్రీ త్రోబాల్, కె.మహర్షిత వాలీబాల్‌లోను, సీహెచ్ లక్ష్మీప్రియ కబడ్డీ, యోగా పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. త్వరలో అనపర్తిలో జరిగే జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఆయా విభాగాల్లో పాల్గొంటారని పీఈటీ రామకృష్ణ తెలిపారు.

స్వామి సన్నిధికి చేరిన పవిత్రాలు



అంతర్వేది స్వామివారి సన్నిధికి చేరిన అహోబిలం పవిత్రాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి అహోబిలం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నుంచి పవిత్రాలు ఆదివారం చేరాయి. ఈ నెల 23 నుంచి 26 వరకూ నాలుగు రోజుల పాటు అంతర్వేది ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలను అర్చకులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పవిత్రాలను అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అంతర్వేదికి తీసుకువచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్న న్యాక్ కమిటీ

రావులపాలెం: కళాశాల మౌలిక సదుపాయాలు, బోధనాంశాలను పరిశీలించి గ్రేడ్ ఇచ్చేందుకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) (బెంగళూరు) కమిటీ బృందం ఈ నెల 20, 21 తేదీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. ఆ కమిటీ బృందం కళాశాలకు సంబంధించిన ఏడు రకాలుగా ఉన్న వివిధ విభాగాల విద్యా ప్రమాణాలను చూసి పరిశీలించి గ్రేడింగ్ ఇస్తుందన్నారు. అయితే ఇప్పటి వరకూ రెండు పర్యాయాలు న్యాక్ కమిటీ పరిశీలించి బీ–గ్రేడ్ ఇచ్చిందన్నారు. మూడో సారి న్యాక్ కమిటీ రానున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.